క్లుప్తంగా

హార్సిలీహిల్స్‌పై పెనుగాలులు

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై సోమవారం పెనుగాలులు వీచాయి. తెల్లవారుజాము నుంచి ఓ గాలులు విపరీతంగా వీస్తుండటంతో పర్యాటకులు ఆందోళనకు గురవుతున్నారు. గాలిబండ, వ్యూపాయింట్ల వద్ద గాలుల వేగం అధికంగా ఉండటం, భీకర శబ్దాలతో వీస్తున్న కారణంగా సందర్శకులు ఈ ప్రాంతాల వైపుకు వెళ్లడం లేదు. చలి కూడా అధికమై చిరుజల్లులు కురుస్తున్నాయి.

యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం



ప్రత్యేక అలంకరణలో యోగభోగేశ్వరుడు

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరురోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి రుద్రాభిషేకం చేశారు. కృత్తికా నక్షత్రం పురస్కరించుకుని అర్చకులు విశ్వేశ్వరప్రసాద్, మురళి శ్రీవల్లిదేవసేన సుబ్రమణ్యస్వామికి అభిషేకాలు చేశారు. భక్తులకు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ రమణ, సిబ్బంది రాజశేఖర్, అంకన్న పాల్గొన్నారు.

పరామర్శ

నిమ్మనపల్లె : తండ్రులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పరామర్శించారు. సోమవారం నిమ్మనపల్లె మండలం బోడుమల్లయ్యగారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఖాసీం తండ్రి అబ్దుల్ రజాక్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుకున్న నిసార్ అహ్మద్, బోడుమల్లయ్యగారిపల్లెకు వెళ్లి అబ్దుల్‌రజాక్ మృతదేహానికి నివాళులు అర్పించారు. అదే విధంగా మదనపల్లె మున్సిపాలిటీ మోతీనగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మహమ్మద్ అలీ తండ్రి అబ్దుల్ జబ్బార్ మృతి చెందారు. నిసార్‌అహ్మద్ వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరురఫీ, ఇమ్రాన్, ఖాదిర్, షఫీ, సద్దాం, సాదిక్, యాసిన్, అబ్దుల్, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలి

-ఏడీఈ గోవిందరెడ్డి

తంబళ్లపల్లె: విద్యుత్ వినియోగదారుల సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ట్రాన్స్‌కో ఏడీఈ గోవిందరెడ్డి సూచించారు. సోమవారం ఆయన తంబళ్లపల్లెలో పర్యటించారు. స్థానిక సబ్ స్టేషన్ పనితీరును తనిఖీ చేశారు. పలు ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేయాలన్నారు. విద్యుత్‌బిల్లులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట ఏఈ సురేంద్ర, సబ్ ఇంజనీర్ శేషుకుమార్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఎగువగిండి గంగమ్మ తిరునాల



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

తంబళ్లపల్లె: మండలంలోని గోపిదిన్నె పంచాయతీ ఉప్పులూరివాండ్లపల్లె సమీపంలో వెలసిన ఎగువగిండి గంగమ్మ తిరునాలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పూజారి భాస్కర్ అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పూజలు,అభిషేకాలు చేశారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళలు దీలు, బోనాలు ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పలు గ్రామాల నుంచి విద్యుత్‌దీపాలతో అలంకరించిన చాందీబండ్లతో మెరవణి, పలు రకాల సంస్కృతిక కార్యక్రమాల విన్యాసాలు భక్తులు అలరింప జేశాయి.

వేరుశనగలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి

- విత్తనకాయల పరీక్ష పాటించకపోతే నష్టమే
- విత్తనశుద్ధితో మొక్కకు సంరక్షణ
- భూసార పరీక్షలు తప్పనిసరి
- లోతైన దక్కులతో అధిక దిగుబడి



వేరుశనగ పొలాల్లో ట్రాక్టర్‌తో దుక్కులు చేస్తున్న రైతన్న



భూసార పరీక్షల నిమిత్తం మట్టినమూనాలను సేకరిస్తున్న అధికారులు

గుర్రంకొండ: జిల్లాలోని పడమటి మండలాల్లో ముఖ్యమైన పంట వేరుశనగ. పడమటి ప్రాంతాల్లో 40శాతం మంది రైతులు వేరుశనగ పంటసాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. ఖరీఫ్‌సీజన్‌లో సాగుచేసే వేరుశనగ పంటపై తగినన్ని మెలకువలు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చు. సాగుకు నెల రోజుల ముందే పొలలాల్లో భూసార పరీక్షలు చేయించాలి. తరువాత విత్తనకాయల పరీక్ష తప్పనిసరిగా చేయించాలి. సాగు సమయంలో విత్తనశుద్ధితో మొక్కలకు ఎంతో సంరక్షణ ఉంటుంది. చాలా మంది రైతులు వీటిపై అవగాహన లేకపోడవంతో తగినంతగా పంటదిగుబడి సాధించలేక నష్టాల పాలవుతున్నారు. సరైన సమయంలో తగినన్ని మెలుకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు.

విత్తనకాయల పరీక్ష

ఖరీఫ్‌సీజన్‌లో వేరుశనగ సాగు చేయడానికి ముందుగా విత్తనకాయల పరీక్షను నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో రైతులు కొనుగోలు చేసిన విత్తనకాయల్లో మొలకెత్తే శాతం తెలిసిపోతుంది. ఒకట్రేలో మట్టి, ఇసుకను, ఎరువులతో నింపి 100 విత్తన గింజల్ని నాటాల్సి ఉంటుంది. 12 రోజుల అనంతరం మొలకెత్తే శాతం బట్టి నాణ్యత పరీక్ష తెలుస్తుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 80 నుంచి 90 శాతం వరకు మొలకెత్తితేనే నాణ్యమైన విత్తనాలుగా నిర్ధారించవచ్చు. ప్రతి రైతు తాము కొనుగోలు చేసిన విత్తనాలను ముందుగా ఇలా పరీక్ష చేసుకోవాలి.

రెండేళ్ల కొకమారు భూసార పరీక్షలు:

రైతులు వేరుశనగ పంట సాగు చేసే పొలాల్లో రెండేళ్ల కొకమారు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలి. పంట సాగు చేసిన ప్రతి సారి భూమిలో నత్రజని, భాస్వరం వినియోగం ఎక్కువగా ఉంటుంది. భూసార పరీక్షలో ఎంతమేరకు వీటి శాతం తగ్గిందో తెలుసుకోవచ్చు. తద్వారా పంటసాగు చేసే ముందు పొలంలో తగినంత మేరకు వీటిని పిచికారి చేస్తే భూసారం మళ్ళీ యథాస్థితికి చేరుకొని మంచి పంట దిగుబడి సాధించవచ్చు. వ్యవసాయాధికారులే రైతుల పొలాల వద్దకు వచ్చి భూసార పరీక్షల నిమిత్తం పొలాల్లో మట్టిని సేకరించుకొని వెళుతుంటారు.

సూక్ష్మపోషకాలు

వేరుశనగ పంట సాగు చేసే పొలాల్లో, చేలల్లో సూక్ష్మ పోషకాల సమతుల్యత సరి చేసుకోవాల్సి ఉంటుంది. పొలాలను దక్కులు చేసే సయయంలోనూ, విత్తనాలు వేసే సమయంలో సూక్ష్మ పోషకాల మందులను వినియోగించాల్సి ఉంటుంది.

బోరాన్, సల్ఫర్

వేరుశనగ పంట సాగులో బోరాన్, సల్ఫర్‌ను తప్పనిసరిగా వినియోగించాలి. తద్వారా వేరుశనగలో కాయలు నాణ్యతగా వస్తాయి. వాటి బరువు కూడా పెరుగుతుంది.

జింక్

జింక్ వినియోగించడం వలన వేరుశనగ మొక్కల్లో కాండం, మొక్క ఎదుగుదల ఎక్కువగా, ధృడంగా ఉంటాయి. అంతేకాకుండా కాయల్లో గింజ ఏర్పడే శాతం కుడా పెరుగుతుంది.

జిప్సమ్

వేరుశనగ పొలాల్లో జిప్సమ్ చల్లడం వలన గింజ ల్లోనూనె శాతం ఎక్కువగా ఏర్పడుతుంది. పంట పొలాలు దక్కులు చేసే సమయంలో ఎకరానికి 200 కేజిల జిప్సమ్ చల్లాలి.

విత్తనశుద్ధి తప్పనిసరి

వేరుశనగ పంట సాగులో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి. డీఎమ్ 45 అనే రకం విత్తనశుద్ధి మందును ఎకరానికి సరిపడే విత్తనగింజల్లో 180 గ్రాములు కలపాల్సి ఉంటుంది. ఈ మందును తప్పనిసరిగా విత్తనగింజల్లో కలిపిన తరువాతే పొలంలో విత్తాలి. తద్వారా గింజల్ని ఆవహించే తినేసే వేరుతొలు చుపురుగులు దూరంగా వెళ్లిపోతాయి. అంతేకాక విత్తనాలు మెలకెత్తే వరకు వాటికి సంరక్షణగా ఉంటాయి.

కలుపు మొక్కల నివారణ

వేరుశనగ పంటసాగులో కలుపు మొక్కల నివారణా మందులు తప్పనిసరిగా వాడాలి. పొలంలో విత్తనాలు వేసిన రోజు సాయంకాలం గానీ, ఆ మరుసటి రోజుగానీ ఈ రకం మందులు పొలంలో పిచికారి చేయాలి. ఎకరం పొలానికి ఒకటిన్నర లీటరు పెండామిథాలిన్ అనే మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంటపొలంపై పిచికారీ చేయాలి. ఇలా చేయడం వలన విత్తనాలు వేసినప్పటి నుంచి సుమారు రెండు నెలల పాటు కలుపు మొక్కలు పెరగకుండా చూడవచ్చు.

అంతర్ పంటలు

వేరుశనగ పంటసాగులో అంతర్ పంటలు కూడా సాగు చేయడం వలన పంటకు ఎంతో రక్షణగా ఉంటుంది. పొలంలో విత్తనగింజలు వేసే ఆరుసాళ్ల(వరుసలు)కు ఒకసాళు కందులు, అలసందలు వంటి విత్తనాలు వేయాల్సి ఉంటుంది. పొలం చుట్టూరా రెండు నుంచి నాలుగు వరసలు జొన్నలు వేయాలి. వీటి వలన పక్కపొలాల నుంచి వైరస్, ఇతర క్రిమి కీటకాలు, ఎర్రగొంగళి పురుగులు వేరుశగన పంటను ఆహించకుండా చేయవచ్చు.

లోతైన దుక్కులతో అధిక దిగుబడి

వేరుశనగ పంట సాగుకు ముందే పొలాల్లో లోతైన దుక్కులు చేయడం వలన అధిక పంట దిగుబడి సాధించవచ్చు. పలువురు రైతులు దక్కుల చేసే ముందు ఎరువులను పొలాలపై చల్లుతారు. ఆ తరువాత లోతైన దుక్కులు చేపడతారు. తద్వారా పొలం పైనున్న ఎరువులు భూమిలోపల చేరి పంటసాగు ప్రారంభానికి ముందే సారవంతమైన ఎరువుగా మారుతుంది.

విత్తన పరీక్షలతో ప్రయోజనం



వేరుశనగ విత్తన పరీక్షలు చేయించుకోవడం వలన రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. విత్తనాలు మొలకెత్తే పరీక్షలు తప్పనిసరిగా చేయిండం వలన విత్తనాల నాణ్యత ముందుగా తెలుస్తుంది. మొలక శాతం ఎక్కువగా ఉన్న విత్తన కాయలకే ప్రాధాన్యత ఇవ్వాలి. పంటసాగులో అన్ని మెలకువలు పాటిస్తేనే మంచి దిగుబడి సాధించవచ్చు. **- రమణ, రైతు, గెరికుంటపల్లె**

అధికారుల సూచనలు పాటించాలి



వేరుశనగ పంట సాగులో వ్యవసాయ అధికారులు ఇచ్చే సూచనలు, మెలకులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చు. పొలంలో గతం సేకరించిన మట్టినమూనాలు ఆధారంగా భూసార పరీక్షల్లో వచ్చిన ఫలితాలను బట్టి అధికారులు ఇచ్చే సూచనలు పాటించాలి. పంట సాగులో ఎంతమేరకు ఎరువులు, పురుగునివారణ మందులు వాడలో తెలుసుకోవాలి. **- ఓబుళరెడ్డి, రైతు, మొరంమీదపల్లె**

ఖరీఫ్ సీజన్‌కు ముందస్తు వ్యవసాయ ప్రణాళిక

కలికిరి: ఖరీఫ్ సీజన్‌కు ముందస్తు వ్యవసాయ ప్రణాళికలపై జిల్లా రైతులతో కేవీకే శాస్త్రవేత్తలు, అధికారులతో కలిసి చర్చించనున్నట్లు కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 29 నుంచి జూన్ 12వ తేదీ వరకు 15 రోజుల పాటు ఖరీఫ్-2025 సీజన్‌కు సంబంధించి ముందస్తు వ్యవసాయ ప్రణాళికపై జిల్లాలోని అన్ని మండలాల రైతులతో కలిసి కేవీకే శాస్త్రవేత్తలు, అధికారులు చర్చిస్తారన్నారు. నూతన వంగడాలు, సాంకేతిక పద్ధతులు, పశు సంపద, విలువ ఆధారిత ఉత్పత్తులు, సేంద్రీయ వ్యవసాయం తదితరాలపై రైతులతో చర్చ, సందర్శనలుంటాయన్నారు. పంటలలో చీడ పీడల నివారణ మార్గాలపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని, రైతులు కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె కోరారు.

1105 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు మంజూరు

నిమ్మనపల్లె : ఖరీప్-2025కు సంబంధించి మండలానికి 1105 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయాధికారి మురళీమోహన్ తెలిపారు. మండలంలో దాదాపు 2,500 ఎకరాల్లో వేరుశనగ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో 305 క్వింటాళ్ల కే-6 రకం, నారాయణి-800 క్వింటాళ్ల విత్తనకాయలు నిమ్మనపల్లెకు చేరాయన్నారు. 40 శాతం సబ్సిడీతో 30 కిలోల విత్తనకాయలను రూ.1,674 చొప్పున రైతులకు అందించనున్నట్లు వ్యవసాయాధికారి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలు అందిన వెంటనే విత్తనకాయల పంపిణీ ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. విత్తనకాయలు అవసరమైన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఆధార్, పట్టాదారుపాసుపుస్తకం జిరాక్స్ తీసుకుని వెళ్లి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



ట్రోఫీ అందుకుంటున్న విజేతలు

మదనపల్లె సిటీ: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని క్రీడాభారతి జిల్లా కార్యదర్శి నరేష్ బాబు అన్నారు. సోమవారం స్థానిక రెడ్డీస్ కాలనీలో స్పోర్ట్స్ అరేనా నిర్వహించిన సమ్మర్ బాడ్మింటన్ క్యాంప్ ముగింపు సందర్భంగా పోటీలు నిర్వహించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమన్నారు. సబ్ జూనియర్ బాలుర విభాగంలో సింగిల్స్‌లో జైదీప్ రన్నర్‌గా, రెడ్డికుశల్‌రెడ్డి విన్నర్‌గా, డబుల్స్ విభాగంలో గగన్, సాహస్ రన్నర్స్‌గా, లలిత్, నకుల్ విన్నర్స్‌గా నిలిచారు. బాలికల సింగిల్స్ విభాగంగా నిహారిక రన్నర్స్‌గా,చైత్న విన్నర్‌గా, డబుల్స్ విభాగంలో నిహారిక, దీక్ష రన్నర్స్‌గా, చైత్ర, హృతిక విన్నర్స్‌గా నిలిచారు. జూనియర్ బాలుర డబుల్స్ విభాగంలో శరణ్య,కుషాల్ రన్నర్స్‌గా,యశ్వంత్,జోషిత్ విన్నర్స్‌గా, జూనియర్ సింగిల్స్ విభాగంలో కుశల్ రెడ్డి రన్నర్స్‌గా, శరణ్య విన్నర్‌గా, మిక్స్డ్ డబుల్ విభాగంలో శరణ్య రన్నర్‌గా, కుశల్‌రెడ్డి విన్నర్స్‌గా నిలిచారు. పురుషుల డబుల్స్ విభాగంలో నిఖిల్, విష్ణు రన్నర్స్‌గా, ఇబ్రహీం మహేంద్ర విన్నర్స్‌గా నిలిచారు. కార్యక్రమంలో పీడీలు బాష, అరేనా డైరెక్టర్ సుదర్శన్, విక్కి, ఉదయ్‌లు గెలుపొందిన విజేతలకు ట్రోఫీల్ను అందజేశారు.

రైల్వే క్రాసింగ్ మార్పునకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న రైల్వే అధికారులు

పీలేరు : పీలేరు పట్టణం మదనపల్లె మార్గంలో ఆర్‌వోబీ నిర్మాణంలో భాగంగా రైల్వే క్రాసింగ్ మార్పు చేయడానికి రైల్వే అధికారులు స్థల పరిశీలన చేశారు. ప్రస్తుతం ఉన్న రైల్వే గేటును పూర్తి మూసి వేసి పక్కకు మార్చవలసిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అధికారులు క్షేత్ర పరిశీలన చేపట్టారు. అలాగే విద్యుత్ లైన్లు పరిశీలన చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపి, వారి ఆదేశాల మేరకు రైల్వే గేటు మార్పు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పాకాల రైల్వే అధికారులు కృష్ణప్రసాద్, నరేష్ చౌదరి పాల్గొన్నారు.

అన్నీ రెవెన్యూ సమస్యలే

పరిష్కరించాలని సబ్‌కలెక్టర్‌కు విన్నపం



వినతులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె: ప్రజా ఫిర్యాదుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టర్ వై.మేఘస్వరూప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని మండలాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ ఫిర్యాదులను అందించారు. అందిన సమస్యల్లో రెవెన్యూ సమస్యలే అత్యధికంగా వచ్చాయి. వినతులపై పరిష్కారానికి చర్యలు చేపట్టి ఫిర్యాదులకు సంబంధించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

-సర్వే నంబర్ 552/1ఏలో ఇచ్చిన మాజీ సైనికోద్యోగి భూమి పట్టాపై సృష్టిస్తున్న అడ్డంకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మదనపల్లెకు చెందిన బి.శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు.

-బి.కొత్తకోటకు చెందిన టి.రామకృష్ణ బైపాస్‌రోడ్డు, దిగువబస్టాండ్, బత్తాలపురం క్రాస్‌లో ఆక్రమణలతో బంకులు, దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారని, వాటిని తొలగించాలని ఫిర్యాదు చేశాడు

-నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లెకు చెందిన రమణమ్మ అనే మహిళ తమ భూమిని గుత్తకు తీసుకుని చనిపోయిన రామన్న పేరుతో ఉన్న భూమికి బోగస్ పాసుపుస్తకాలు చేసుకున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కుమార్ ఫిర్యాదు చేశారు.

-ములకలచెరువు మండలం గుండాల్లోళ్లపల్లెకు చెందిన శ్రీనివాసులు తమ కుటుంబానికి చెందిన ఐదెకరాల భూమిలో 1.60 ఎకరాల భూమిని ఇద్దరి పేర్లతో వీఆర్‌ఓ ఆన్‌లైన్ చేశారని, దీనిపై న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు.

-బి.కొత్తకోట మండలం నాయనబావికి చెందిన రమణారెడ్డి తన 50 సెంట్ల భూమికి ఆన్‌లైన్ చేయాలని, పాసుపుస్తకం, వన్‌బీ మంజూరు చేయాలని పలుమార్లు వినతులు ఇచ్చినా పరిష్కారం కాలేదని మళ్లీ ఫిర్యాదు చేశారు.

-నిమ్మనపల్లె మండలం గౌనిగారిపల్లెకు చెందిన అలివేలమ్మ తన భూమి 2.97 ఎకరాలను వేరొకరు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

రేపటి నుంచి మాతమ్మ జాతర

సుండుపల్లె : ఈనెల 28వ తేదీ అనగా రేపటి నుంచి పెద్దమాదిగపల్లెలో వెలసివున్న మాతమ్మ తల్లి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రికి అమ్మవారి ఉత్సవ విగ్రహంతో మేళతాళాలు, బాణసంచాలు కాలుస్తూ గ్రామంలో గ్రామోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. 29వ తేదీ గురువారం ఉదయం గావుపట్టుట, పుట్ట బంగారు తెచ్చి పూజించడంతోపాటు పొంగుబాలు తెచ్చి పొంగుపెట్టడం, సిద్దులకు ఒకపొద్దు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని మొక్కుబడుల్లో భాగంగా రాత్రికి చాందినీబండ్లు ఏర్పాటు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఉదయం బోనాల కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులుపెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని గ్రామస్తులు కోరారు.

హాస్టల్స్‌లో దోమలమందు పిచికారీ

మదనపల్లె రూరల్ : పట్టణంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేసినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి ఖలీలుల్లా ఖాన్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...పట్టణంలోని చంద్రాకాలనీ, మాయాబజార్, నీరుగట్టువారిపల్లె, ఎస్‌వీఆర్ స్ట్రీట్, మోతీనగర్‌లోని వసతిగృహాల్లో ఏసీఎం 5శాతం ద్రావణాన్ని పిచికారీ చేశామన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు దోమలతో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్స్, హెల్త్ సెక్రటరీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా నల్లగంగమ్మ జాతర



కేవీపల్లె : మండలంలోని సొరకాయలపేట పంచాయతీ మిన్నంరెడ్డిగారిపల్లెలో శ్రీ నల్లగంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వెలసిన నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు చాందినీబండ్లు కట్టి అమ్మవారి ఆలయ ప్రదక్షిణ చేశారు. ఉదయం పలువురు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగుల తొలగింపు ఆపాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె: విశాఖ ఉక్కు కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా తొలగిస్తూ ఉపాధిని కోల్పోయేలా చేస్తున్నారని నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికులు, ఉద్యోగుల తొలగింపు ఆపాలని, ఇప్పటికే తొలగించిన 2,500 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టి.కృష్ణప్ప, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు సురేష్‌కుమార్ మాట్లాడుతూ వర్క్ టెండర్లు రెన్యూవల్ చేయకుండా 1,500 మందిని, 1,200 మంది పర్మినెంట్ కార్మికులను వీఆర్‌ఎస్ పేరుతో తొలగించారని అన్నారు. వీరుకాక మరో మూడువేల మంది కార్మికులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ కార్మికులను కాపాడుకోవడం కోసం పనిచేస్తున్న 12వేల మంది కార్మికులు సమ్మె చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. నాలుగేళ్లగా కార్మికుల హక్కులు, ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా చట్ట వ్యతిరేక చర్యలు తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. యోగా డే కోసం వస్తున్న ప్రధాని మోదీ ఉక్కు ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మస్తాన్, చలపతినాయుడు, ముబారక్, తిరుమల దేవా, వాసు, సంజీవ, రాధ, జానకి, పోతులప్ప తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి నిధులు ఇవ్వాలి

లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా రాయచోటి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఒక ప్రకటన ద్వారా పలు సమస్యలపై వివరించారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని శాశ్వత ప్రతిపాదికన కొనసాగించాలని కోరారు. జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటిని మారుస్తారనే అనుమానాలను తొలిగించాలన్నారు. అలాగే కడప - మదనపల్లె - బెంగుళూరు రైల్వే లైన్ నిధులు మహానాడు వేదికగా కోరాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా తాగునీరు, సాగు నీరు అందించేందుకు మండిపల్లి నాగిరెడ్డి (శ్రీనివాసపురం రిజర్వాయర్) కాల్వ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు, వై.ఆదినారాయణరెడ్డి పింఛా ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని కోరారు. అలాగే అన్నమయ్య జిల్లాలో ఉన్న రాయలనాటి చెరువులు, కుంటలకు సంరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. మామిడి రైతులకు మేలు జరిగే విధంగా మార్కెట్ యార్డులో అమ్మకాలు, కొనుగోలు చేయాలని కోరారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

- మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల

మదనపల్లె రూరల్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల కోరారు. సోమవారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో మహిళాసంఘాల సభ్యులు, ఆర్పీలతో యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ప్రమీల మాట్లాడుతూ....జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో 2 లక్షల మందితో యోగాసనాలు వేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమానికి స్ఫూర్తిగా నెలరోజుల పాటు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో బుధవారం ఉదయం పట్టణంలోని బీటీ కళాశాల గ్రౌండ్‌లో ఉదయం 6 గంటల నుంచి 8.30 నిమిషాల వరకు మెగా యోగ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పెద్దసంఖ్యలో మహిళలు హాజరై యోగాసనాలు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం మధుసూధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నిమ్మనపల్లె : యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం జెడ్పీహైస్కూల్‌లో పీడీ భద్రయ్య ఆధ్వర్యంలో యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ..యోగా ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన చేసి అలవాటుగా మార్చుకోవాలన్నారు. యోగా ఏకాగ్రతను పెంచుతుందని, దీంతో రోజంతా చురుగ్గా ఉండవచ్చన్నారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రజల్లోకి అవగాహన కార్యక్రమాలు తీసుకెళుతున్నట్లు చెప్పారు.

యోగా దినచర్య కావాలి

బి.కొత్తకోట: యోగా చేయడాన్ని ప్రతి ఒక్కరూ దినచర్యగా చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ జీవీ.పల్లవి అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ఆవరణలో యోగాంధ్రలో భాగంగా యోగా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వశాఖలకు చెందిన అధికారులు, వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు హాజరయ్యారు. వీరు యోగా ఆసనాలు వేశారు. ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంఈవో రెడ్డిశేఖర్, ఏపీఓ వెంకటేష్, ఏపీఎం రాజేశ్వరీ పాల్గొన్నారు.



యోగాసనాలపై అవగాహన కల్పిస్తున్న పీడీ భద్రయ్య



బి.కొత్తకోటలో యోగా చేస్తున్న ఉద్యోగులు